ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న రాధాకృష్ణ

సిఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈ నెల 30న పత్తికొండలో ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. శుక్రవారం సిఎం పర్యటనపై జిల్లా కలెక్టర్ అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కర్నూలు, ఆదోని ప్రాంతాల నుండి బస్సు ద్వారా వచ్చే ప్రజలకు పార్కింగ్ ప్రదేశం నుండి సభా ప్రాంగణం వరకు నడిచే దూరం ఎక్కువ లేకుండా చూడాలని ఎస్‌పి, జాయింట్ కలెక్టర్, ఆదోని సబ్ కలెక్టర్లకు సూచించారు. సభా ప్రాంగణంలో రోలింగ్ పనులు, రహదారుల ప్యాచింగ్ పనులు, హెలిప్యాడ్ వద్ద పెండింగ్‌లో ఉన్న పనులు, రోడ్ మీదికి డ్రైన్ వాటర్ రాకుండా చేయాల్సిన పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆర్ అండ్ బి ఎస్ఇని కలెక్టర్ ఆదేశించారు. డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ బస్సులు తిప్పిన తర్వాత వారు గుర్తించిన సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొని రాగా, ఆ సమస్యలను కూడా త్వరగా పరిష్కరించాలని ఆర్అండ్‌బి ఎస్ఇని ఆదేశించారు. సభా ప్రాంగణం, హెలిప్యాడ్ వద్ద పారిశుధ్య పనులను, పిచ్చి మొక్కలు తీసివేయడం, రోడ్లను శుభ్రపరచడం వంటి పనులను శానిటేషన్ సిబ్బందితో చేయించాలని డిపిఒకు సూచించారు. ఇంకా చుట్టుపక్కల ఎక్కడైనా ముళ్ళకంపలు తీసివెయ్యనివి ఉంటే వాటిని కూడా తీసివేయించేలా చర్యలు తీసుకోవాలని ఆదోని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. సభా ప్రాంగణం వద్ద ప్రజలకు ఇబ్బంది కలగకుండా తాగునీరు ఏర్పాటు చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను అదేశించారు. వేదిక, ఇతర ఏర్పాట్లపై సమీక్షించారు. జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ కర్నూలు, ఆదోని ప్రాంతాల నుండి వచ్చే బస్సులకు పార్కింగ్ స్థలాలను గుర్తించామని కలెక్టర్‌కు వివరించారు. జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ స్టేజ్ ఏర్పాటుకు సంబంధించిన పనులను ఈరోజు లోపు పూర్తి చేయాలని ఆర్అండ్‌బి ఎస్ఇని అదేశించారు. టెలికాన్ఫరెన్స్‌లో ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పత్తికొండ ఆర్‌డిఒ మోహన్ దాస్, జిల్లా , మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో రైతులకు పనిముట్లను అందజేస్తున్న కలెక్టర్ సృజన

రైతులకు పనిముట్లు అందజేత

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

ఎమ్మిగనూరు మండలం కందనాతి గ్రామంలో ప్రధానమంత్రి కృషి సంచాయీ యోజన, వాటర్ షెడ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఉత్పాదకత పెంపుదల కార్యక్రమంలో భాగంగా రైతులకు కలెక్టర్ డాక్టర్ జి.సృజన, డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రధానమంత్రి కృషి సంచాయీ యోజన, వాటర్ షెడ్ పథకాలను రైతులు ఉపయోగించుకోవాలని కోరారు. మండలంలో వాటర్ షెడ్ కింద ఎంపిక కావడంతో రైతులు అభివృద్ధి చెందేందుకు ఉత్పాదకత పెంపుదల కార్యక్రమంలో భాగంగా రూ.64 లక్షలతో 310 మంది రైతులకు సబ్సిడీతో పంప్ సెట్లు, టార్పాన్లు, స్ప్రేర్ పంపులు అందజేశారు. కడివెల్ల, కందనాతి పంచాయతీ అధికారులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

'ఇఎస్ఐ'ని బలోపేతం చేయాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు రాధాకృష్ణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఇఎస్ఐ పథకాన్ని మరింత బలోపేతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఇఎస్ఐ పథకాన్ని బలోపేతం చేయాలని, కర్నూలు ఇఎస్ఐ హాస్పిటల్‌ను కేంద్ర అజమాయిషీకి పంపవద్దని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సిఐటియు ఓల్డ్ సిటీ అధ్యక్షులు అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన జరిగిన సభలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, సిఐటియు న్యూ సిటీ ఓల్డ్ సిటీ కార్యదర్శులు సాయిబాబా,విజయ్ నగర నాయకులు టి.రాముడు మాట్లాడుతూ కార్మికులకు ఆసుపత్రి, మందులు,పెన్షన్లు,సిక్ వేతనాలు, నిరుద్యోగ భృతి తదితర సౌకర్యాలు కల్పించే ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ (ఇఎస్ఐ) పథకాన్ని కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు నీరుగారు స్తున్నాయన్నారు. ఈ పథకాన్ని 2022 సంవత్సరానికల్లా దేశవ్యాప్తంగా విస్తరించాలని నిర్ణయం తీసుకున్నప్పటికీ దానిని అమలు చేయడం లేదన్నారు. ఇఎస్ఐ హాస్పిటల్ లో డాక్టర్లు, పరికరాలు సిబ్బంది, మందులు కొరత తీవ్రంగా ఉంటుందన్నారు. ఈ పథకంలో కార్మికుల నుండి వసూలైనవి దాదా పు రూ.లక్ష పదివేల కోట్ల రిజర్వ్ నిధులు ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం దీనిని ప్రైవేటు కరణ చేయాలని ప్రయత్నిస్తున్నదని, మరోపక్క రాష్ట్ర ప్రభుత్వం తమ ఆధీనంలో ఉన్న హాస్పిటల్స్‌ను ప్రైవేటుపరం చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తూ ఊరుకుంటున్నదన్నారు. మన రాష్ట్రంలో26 జిల్లాల్లో కనీసం 30 పడకల ఆసపత్రులు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అదనంగా ప్రతి 20 వేల మంది ఇఎస్ఐ చందాదారులకు అందుబాటులో ఉండే విధంగా 30 పడకల ఆసుపత్రులను నిర్మించవచ్చన్నారు. 2016లో విశాఖపట్నంలో 500 పడకల హాస్పిటల్ నిర్మించడానికి శంకుస్థాపన చేశారు. కానీ అది నేటికీ పూర్తికాలేదు. అదేవిధంగా విజయవాడ, తిరుపతి నగరంలో ఆసుపత్రి భవనాలు ఆధునిక పరికరాలు, డాక్టర్లు, సిబ్బంది, మందులులతో అభివద్ధి చేయాలన్నారు. నెల్లూరులో వంద పడకల ఆసుపత్రి నిర్మించాలని, ఇఎస్ఐ డెస్పెన్సరీలో ల్యాబ్ సౌకర్యాలు కల్పించాలని, డాక్టర్లు , పారా మెడి కల్ సిబ్బందిని ఏర్పాటు చేయాలని , వీటన్నింటిని కూడా పట్టించు కోకుండా చాలా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. అందువల్ల ఇఎస్ఐ పథకాన్ని బలోపేతం చేయకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర నాయకులు కృష్ణ, రామకృష్ణ, ఏసు, సుధాకరప్ప పాల్గొన్నారు.

రేషన్ కార్డుదారులకు రాగులు

- జూన్ కోటా కింద పంపిణీకి చర్యలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పేదలకు బియ్యంతో పాటు రాగులను కూడా అందించేందుకు పౌరసరఫరాల శాఖ చర్యలు తీసుకుంటుంది. ఈ మేరకు జూన్ నెలలో రేషన్ కార్డుదారులందరికీ పంపిణీ చేసేలా చర్యలు చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాదిని చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటిస్తూ నిరుపేదలకు అధిక పోషక విలువలు ఉన్న ఆహారాన్ని అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. పౌరసరఫరాల శాఖ కార్డుదారులకు ఉచితంగా మూడు కిలోల చొప్పున రాగుల పంపిణీకి చర్యలు ప్రారంభించింది. పైలట్ ప్రాజెక్టు కింద కర్నూలు జిల్లాను ఎంపిక చేశారు. కర్నూలు జిల్లాలో దాదాపుగా రూ.6.60 లక్షలకు పైగా తెల్ల కార్డు దారులు ఉన్నారు. ప్రస్తుతం కార్డుదారులకు ఉచితంగా ఒక్కో సభ్యునికి ఐదు కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తున్నారు. జూన్ నెలలో ఒక రేషన్ కార్డుదారుడికి 10 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తే అందులో మూడు కిలోలు రాగులు 7 కిలోలు బియ్యాన్ని అందజేయాలని పౌరసరఫరాల శాఖ చర్యలు తీసుకుంది. ఇప్పటికే రాగుల పంపిణీకి కర్నూలు జిల్లా కోటా కింద 1900 మెట్రిక్ టన్నుల రాగులు అవసరం అవుతాయని పౌరసరఫరా శాఖ ఉన్నతాధికారులకు నివేదించారు. అందుకు అనుగుణంగా కోటాను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ అధికారులు జిల్లాకు విడుదల చేశారు. ప్రధానంగా నిరుపేదలకు రాగులను తీసుకోవడం ద్వారా అనేక ఆహార పోషక విలువలు ఉంటాయని పౌరసరఫరా శాఖ అధికారులు పేర్కొంటున్నారు. షుగర్ వ్యాధి నియంత్రణతో పాటు గుండె వ్యాధికి సంబంధించి, జీర్ణక్రియను మెరుగుపరచడం, శారీరక బరువు నియంత్రణతో పాటు బాలింతలకు పాల ఉత్పత్తి పెంపు కూడా ఉంటుందని పౌరసరఫరాల అధికారులు పేర్కొంటున్నారు.

టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయండి

- టమోటాకు మద్దతు ధర కల్పించాలి - సాగు, తాగునీరివ్వడం

ప్రజాశక్తి-పత్తికొండ

పత్తికొండ కరువు పీడిత ప్రాంతం నుంచి విముక్తి పొందాలంటే సాగు, తాగునీరు ఇచ్చి టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని, రైతుల చిరకాల కోరిక తీర్చాలని ఈనెల 30న పత్తికొండకు వస్తున్న ముఖ్యమంత్రిని ప్రజలు కోరుతున్నారు. పత్తికొండ నియోజకవర్గంలోని పత్తికొండ, మద్దికేర, తుగ్గలి, క్రిష్ణగిరి వెల్దుర్తి మండలలోని రైతులు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. ఖరీఫ్ లోని ప్రధానపంటగా పత్తి, టమోటా , వేరుశనగ , ఉల్లి సాగు చేస్తారు. చిత్తూరు జిల్లా మదనపల్లి టమోటా మార్కెట్ తర్వాత కర్నూలు జిల్లా పత్తికొండ మార్కెట్‌లో టమోటాను అత్యధికంగా క్రయవిక్రయాలు జరుగుతాయి. పత్తికొండ టమోటాను ఆపిల్ గా పిలుస్తారు.వ్యాపారస్తులు టమోటా పంటలను తెలంగాణ, కర్ణాటక ఇతర రాష్ట్రాలకు రవాణా చేస్తారు. పత్తికొండ తుగ్గలి మద్దికేర దేవనకొండ మండలాలలో గ్రామీణ ప్రాంతాలలో 2,664 వేల హెక్టార్లలో రైతులు టమోటా సాగు చేస్తారు. ఎకరాకు 40 వేల నుంచి 60వేల వరకు పెట్టుబడి పెడుతారు. బోర్ కింద టమోటాను 1000 బాక్సులు , వర్షాధారం కింద 500 బాక్సులను పంటను దిగుబడి చేస్తారు. పంట చేతికొచ్చే సమయంలో టమోటా ధర పతనం కావడంతో రైతులు ఆందోళన చెందుతారు. టమోటా మార్కెట్లో అక్టోబర్ నవంబర్ మాసంలో టమోటా కిలో రూపాయి ధర పలుకుతుంది. పెట్టుబడి రవాణా కూలీ ఖర్చులు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం అధిక వర్షాల వల్ల టమోటా పంట పూర్తిగా నష్టం వాటిల్లింది. వ్యవసాధికారులు రైతులను పరామర్శించిన దాఖలు లేవు. పెట్టిన పెట్టుబడి చేసిన అప్పులు తీర్చలేక రైతులు ఆత్మహత్యలు శరణమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ యంత్రాంగం మద్దతుగా కల్పించడంలో పూర్తిగా విఫలం చెందిందని రైతు సంఘాలు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పత్తికొండలో టమోటా జ్యూస్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలని రైతులు కోరుచున్నారు.

టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలి

- రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి రంగారెడ్డి

పత్తికొండలో టమోటా జ్యూస్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయాలి. టమోటా ధర పతనం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు, రైతులకు లాభదాయకంగా ఉంటుంది.

నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుంది..

- కాశీ, నిరుద్యోగి

పత్తికొండలో టమోట జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడం వల్ల నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుంది. డిప్లమా కోర్స్ పూర్తి చేసుకుని ఇంటి దగ్గరే వ్యవసాయ పనులు చేసుకుంటున్నాం. సీఎం స్పందించి జ్యూస్ ఫ్యాక్టరీకి ప్రతిపాదనలు ఇవ్వాలి. టమోటా ధర పతనం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు లాభదాయకంగా ఉంటుంది.

ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలి

- ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఒకరోజు రిలే దీక్ష

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

ప్రభుత్వ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను, ఇవ్వాల్సిన జిపిఎఫ్, నాలుగు డిఎలను వెంటనే ఇవ్వాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా చౌక్‌లో ఒక రోజు రిలే దీక్షలు నిర్వహించారు. ఈ దీక్షల ప్రారంభానికి ముఖ్య అతిథిగా వచ్చిన రాష్ట్ర కార్యదర్శి బాబా సాహెబ్, జిల్లా అధ్యక్షులు బంగి శ్రీధర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులను రోడ్లమీదకు నెట్టిందని, కనీస వేతనాలు, ఇవ్వాల్సిన డిఎలు కూడా ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో పలుమార్లు ధర్నాలు నిరసనలు తెలిపినా రాష్ట్ర ప్రభుత్వం నుండి ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో దశలవారీ ఉద్యమాలు చేస్తున్నామని తెలిపారు. అనంతరం నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మురళీధర్ నాయుడు, చెన్నకృష్ణ మాట్లాడుతూ ఉద్యోగులకు పిఆర్‌సి రద్దు చేయలేదని, డీఏలు ఇవ్వలేదు,12వ పిఆర్‌సి వేయకుండా పిఆర్‌సి ఇవ్వాలని ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా సిపిఎస్ రద్దు చేయాలన్నారు. రోజురోజుకు ఉద్యమం పెరుగుతుందని తెలి పారు. వాణిజ్య పన్నుల శాఖ సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దశరథ రఘురామి రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల డిమాండ్ల సాధనకు తమ సంఘం సంపూర్ణ మద్దతుగా ఉద్యోగుల పక్షాన నిలుస్తుందన్నారు. ఈ దీక్షలకు అగ్రికల్చర్, మున్సిపల్, హెల్త్, రెవెన్యూ, హార్టీ కల్చర్, ఐసిడిఎస్, విఆర్ఒ, ట్రెజరీ, పెన్షనర్స్,ఎడ్యుకేషన్ తదితర సంఘాలు మద్దతు తెలిపారు. ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

దీక్షలు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు

సిఎం పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి : డిఐజి

ప్రజాశక్తి -పత్తికొండ

పత్తికొండ పట్టణంలో ఈనెల 30న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని అధికారులను డిఐజి సెంథిల్ కుమార్ ఆదేశించారు. పత్తికొండలో సెయింట్ జోసెఫ్ స్కూల్లో ఈనెల 30న రాష్ట్ర ముఖ్యమంత్రి రైతు భరోసా బటన్ నొక్కు కార్యక్రమం బహిరంగ సభ ప్రాంగణాన్ని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హెలిపాడ్ స్థలాన్ని డిఐజి సెంథిల్ కుమార్, జిల్లా ఎస్‌పి కృష్ణ కాంత్ ఎమ్మెల్యే శ్రీదేవి శుక్రవారం పరిశీలించారు. వారి వెంట ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్డిఓ మోహన్ దాసు, డిఎస్‌పి శ్రీనివాసులు, సిఐ మురళీమోహన్, తహశీల్దార్ విష్ణు ప్రసాద్ పాల్గొన్నారు.

రూ. 20 లక్షలతో మారెళ్లలో సిమెంట్ రోడ్లు

ప్రారంభించిన సర్పంచి సుగుణమ్మ

ప్రజాశక్తి తుగ్గలి

మండలం పరిధిలోని మారెళ్ళలో సచివాలయం గ్రాంట్ కింద మంజూరైన రు.20 లక్షలతో సిమెంట్ రోడ్డును సర్పంచ్ సుగుణమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ [illegible] పత్తికొండ శాసనసభ్యులు శ్రీదేవి గడపగడప మన ప్రభుత్వ కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా తమ గ్రామంలో సిమెంటు రోడ్లు లేవని అడిగినందుకు స్పందించిన ఎమ్మెల్యే శ్రీదేవి సచివాలయానికి రు.20 లక్షల నిధులను మంజూరు చేసింది అన్నారు. ఆ నిధులతో గ్రామంలోని వివిధ కాలనీలలో సిమెంటు రోడ్లు వేయడం జరుగుతుందన్నారు. కొన్ని సంవత్సరాలుగా గ్రామంలో సిమెంటు రోడ్లు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడేవారని, ప్రస్తుతం సిమెంట్ రోడ్లతో ఆ పరిస్థితి కనపడదు అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతి సచివాలయానికి రు.20 లక్షలు నిధులను వివిధ అభివద్ధి పనులకు మంజూరు చేయడం హర్షించ తగ్గ విషయం అన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ప్రస్తుతం ముఖ్యమంత్రి గ్రామాలను అభివద్ధి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు సుధాకర్ రెడ్డి, కురువ లింగన్న, పులగము మద్దిలేటి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయం, ఎమ్ఎస్ఎంఇ లోన్లపై బ్యాంకర్లు శ్రద్ధ వహించాలి

డిసిసి సమావేశంలో కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

జిల్లా క్రెడిట్ ప్లాన్ 2023-24 పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్

వ్యవసాయం ఎమ్ఎస్ఎంఇ లకు సంబంధించిన లోన్లు ఇచ్చే విషయంలో బ్యాంకర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ బ్యాంకర్లను అదేశించారు. శుక్రవారం జిల్లా పరిషత్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్థాయి బ్యాంకర్స్ కన్సల్టేటివ్ కమిటీ (డిసిసి) సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ముందుగా బ్యాంకర్స్ కన్సల్టేటివ్ కమిటీ (డిసిసి) సమావేశానికి బ్యాంక్ కో ఆర్డినేటర్లు హాజరు కాకపోవడంతో కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరుకాని కో ఆర్డినేటర్ల పేర్లు, బ్యాంకు పేరుతో సహావారి హెడ్ ఆఫ్ ది బ్యాంక్ దృష్టికి తీసుకొని వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ఎల్‌డిఎంను అదేశించారు. వ్యవసాయానికి సంబంధించి లోన్లు ఇచ్చే విషయంలో ప్రభుత్వ బ్యాంకుల కంటే ప్రైవేట్ బ్యాంకులు ఎక్కువ బాధ్యతతో వ్యవహరిస్తున్నాయన్నారు. ముఖ్యంగా పంజాబ్ నేషనల్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందరి కన్నా చాలా తక్కువ శాతం ఇస్తున్నారని, వ్యవసాయానికి సంబంధించిన లోన్లు ఇచ్చే విషయంలో ప్రభుత్వ బ్యాంకులు పురోగతి సాధించాలని సంబంధిత బ్యాంకర్లను అదేశించారు. ఎంఎస్ఎంఇ అప్లికేషన్ శాంక్షన్ చేసే విషయంలో కూడా ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పురోగతి సాధించలేదని, ఈ ఆర్థిక సంవత్సరం నుండి అయిన బ్రాంచ్ మేనేజర్లతో కో ఆర్డినేటర్ సమీక్షలు నిర్వహించి వారికి నెల వారి లక్ష్యాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత బ్యాంక్ అధికారులను ఆదేశించారు. వచ్చే సమావేశం నుండి ఫిషరీస్‌కు సంబంధించిన లక్ష్యాలను కూడా బ్యాంకుల వారిగా పంపించి ఆ అంశాన్ని కూడా ఇందులో పొందుపరచాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ టిడ్కో ఇళ్లకు రుణాల మంజూరులో కూడా కొన్ని బ్యాంకులు వెనుకబడి ఉన్నాయన్నారు. టిడ్కో ఇళ్లకు సంబంధించి సాంక్షన్ చేసిన వాటికి లోన్ల డిస్బర్స్‌మెంట్ త్వరగా మంజూరు చేసేలా చూడాలన్నారు. తదనంతరం కర్నూలు జిల్లా క్రెడిట్ ప్లాన్ 2023–24 కి సంబంధించిన పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో ఎల్‌డిఎం రామచంద్రరావు, ఆర్‌బిఐ లీడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసర్ రెహ్మాన్, తదితర జిల్లా అధికారులు, బ్యాంకర్లు పాల్గొన్నారు.

మోడల్‌లో ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి-సి బెళగల్

సి.బెళగల్ లోని మోడల్ స్కూల్లో ఇంటర్ విద్య ప్రవేశం కొరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ వంశీమోహన్ రావు ఆసక్తిగల విద్యార్థిని విద్యార్థులకు సూచించారు. వచ్చే నెల 7 వరకు గడువు ఉందని ఏదేని గుర్తింపు పొందిన పాఠశాలలో పది ఉత్తీర్ణత చెందిన వారు మాత్రమే ఆన్‌లైన్‌లో చేసుకొని జిరాక్స్ కాపీలను స్కూల్లో సమర్పించాలని పేర్కొన్నారు. ఎస్‌సి, ఎస్టీలు రూ.150 రుసుం, ఇతరులతే రూ.300 రుసుం చెల్లించాలని పది మార్కుల మెరిట్ ఆధారంగా ఎంపిక చేయడం జరుగుతోందని అన్నారు.

తుగ్గలి ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా వీరరాజు

ప్రజాశక్తి-తుగ్గలి

మండల పరిషత్ ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా వీర రాజును నియమిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. తుగ్గలి మండల పరిషత్తు ఇంచార్జి ఎంపిడిఒగా ఉన్న [illegible] సూపరిన్‌టెండెంట్‌గా కొనసాగిస్తూ ఫుల్ అడిషనల్ ఇంచార్జి ఎంపిడిఒగా వీర రాజును నియమించారు. దీంతో ఆయన ఇంచార్జి బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి వాలంటరీ ప్రజలకు తెలియజేసి వారికి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. సచివాలయంలో అందుతున్న సేవలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలనికోరారు.

పదేళ్లయినా అభివృద్ధికి నోచని షాపింగ్ కాంప్లెక్స్

-సొంత ఖర్చులతో మట్టి రోడ్లను మరమ్మతులు చేసుకుంటున్న భవన యజమానులు

-వార్డు కార్పొరేటర్ లేనందున అభివద్ధి కుంటు పడింది

-పట్టణ పౌర సంక్షేమ సంఘం

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్



మురుగు గుంటను పరిశీలిస్తున్న పిపిఎస్ నాయకులు

ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో దాదాపు 50 షాపుల యజమానులు ఏటా ఇంటి పన్నుల రూపంలో చెల్లిస్తున్నా పదేళ్ల నుండి రూ.10 అభివృద్ధి కూడా జరగలేదని వ్యాపారులు, చేతివృత్తుల ప్రజలు ఆ ప్రాంతంలో పర్యటించిన పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం దృష్టికి తెచ్చారు. మట్టి రోడ్లు గుంతలు పడినప్పుడల్లా సొంత ఖర్చులతో మరమ్మతులు చేసుకుంటున్నామని, స్థానికులు లక్షణ గౌడ్ తన ఆవేదన వ్యక్తం చేశారు. కాలువల్లేక మురుగునీరు నిలిచి దుర్వాసనతో అనారోగ్యాలకు గురవుతున్నామనిచేతి వృత్తులు చేసుకునే గోపినాథ్ తెలిపారు. సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఇరిగినేని పుల్లారెడ్డి, ఎం.నాగరాజు మాట్లాడుతూ అవసరం లేని అభివృద్ధి పనులు చేస్తూ కోట్లు ఖర్చు చేస్తున్న అధికారులకు ఈ ప్రాంత సమస్యలు ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. కార్పొరేటర్ లేనందువల్ల 42 వ వార్డు అభివృద్ధి కుంటుపడిందన్నారు. వెంటనే మురికి కాలువలు సిమెంట్ రోడ్లు నిర్మించాలని కోరారు. ఈ పర్యటనలో సంఘం నగర నాయకులు ఎన్.మద్దిలేటి, కె.శ్రీనివాసులు ఎస్.రమణ గౌడ్, సివి. వర్మ తోపాటు స్థానికులు పాల్గొన్నారు.

పార్వతయ్య రాసిన నందమూరి శతకం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

నందమూరి శతకం పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్ : నందమూర్తి తారక రామారావు శతజయంతి సందర్భంగా "నందమూరి శతకము" అనే పుస్తకాన్ని ప్రముఖ నీలోఫర్ హాస్పిటల్ అధినేత వైద్యులు సుభాన్ ఆవిష్కరించారు. కర్నూలు నగరంలోని పింగళి సూరన్నతెలుగు తోటలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు ఎంపి బసవరాజు అధ్యక్షతన పుస్తకావిష్కరణసభ నిర్వహించారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగారు మోహన్, కర్నూలు జిల్లా రంగస్థలం కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ,గుర్రపుశాల అంకయ్య, టిజివి కల్చరల్ అకాడమీ అధ్యక్షులు, వివి.రమణారెడ్డి , ప్రముఖ రచయిత ఎస్ డివి.అజీజ్ పాల్గొని పుస్తకావిష్కరణ చేశారు. అతిథులు మాట్లాడుతూ ఎన్‌టిఆర్ గురించి అతి తక్కువ సమయంలో 100 పద్యాలు" శతకం" రాయడం అనేది చాలా గొప్ప విషయమన్నారు. ఎన్‌టి. రామారావు గురించి రాసిన పద్యాలలో వారు కొన్ని చదివి వినిపించి సభికులను మైమర్పించి ఆనందం వెలిబుచ్చారు. అనంతరం జ్ఞాపికను చిరుకానుకగా రచయిత పార్వతయ్య వచ్చిన అతిథులందరికీ ఇచ్చి సత్కరించారు. రచయితను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి నాయకులు నాగరాజు ,బతుకన్న ,కళాకారులు రాజశేఖర్, ఆర్.కృష్ణ మహమ్మద్ షరీఫ్, రచయితల సంఘం జిల్లా నాయకులు,సాహితీ ప్రియులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నాయకులు జెఎన్. శేషయ్య, రోషన్ అలీ, రామకృష్ణ, విజయ్, అబ్దుల్ దేశాయ్, బజారన్న ,చిన్నికృష్ణ , గౌరెడ్డి హరిచంద్ర రెడ్డి పాల్గొన్నారు.

ఆర్ఆర్ఆర్ విధానం పాటిద్దాం

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



త్రిపుల్ ఆర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న పద్మలత

కర్నూలు నగరపాలక సంస్థ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెడ్యూస్ రీసైకిల్ (ఆర్ఆర్ఆర్) విధానాన్ని పాటిద్దామని 17వ వార్డు కార్పొరేటర్ కైపపద్మలతరెడ్డి అన్నారు. శుక్రవారం చాణిక్యపురి కాలనీలో త్రిపుల్ ఆర్‌సెంటర్‌ను ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ త్రిబుల్ ఆర్ సెంటర్స్‌ను మే 22 నుండి జూన్5 వరకు ప్రతిరోజు ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నగర పాలక సంస్థలోని అన్ని సచివాలయంల పరిధిలో ఏర్పాటు చేశారన్నారు. ప్లాస్టిక్ వస్తువులు, పాత పుస్తకాలు , పేపర్లు, వాడిన వస్త్రాలు , వస్తువులు సేకరించి వాటిని రీసైక్లింగ్ చేస్తారని చెప్పారు. ప్రజలందరూ ఇటువంటి వస్తువులు తమ దగ్గర ఉన్నట్లయితే స్వచ్ఛందంగా ఆర్ఆర్ఆర్ సెంటర్‌కు ఇచ్చి అందుకు ప్రతిగా సేంద్రియ ఎరువులను పొంది పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం కావాలని కోరారు.

నీటి సమస్య వల్ల వలసలు

- వామపక్ష నాయకులు

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని మాధవరం గ్రామంలో నీటి సమస్య వల్ల ప్రజలు వలసలు వెళ్తున్నారని వామపక్ష నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం, ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని తహశీల్దార్ చంద్రశేఖర్‌కు, ఎంపిడిఒ ప్రభావతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి జయరాజు, సిపిఐ నియోజకవర్గ నాయకులు భాస్కర్ యాదవ్ మాట్లాడారు. మాధవరం గ్రామంలోని ఎస్సీ కాలనీలో కొన్నేళ్లుగా తాగునీటి సమస్య ప్రధానంగా ఉందని తెలిపారు. నేటికీ వారి గోడు వినిపించడం లేదన్నారు. అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా ఫలితం శూన్యమని, విసుగు చెంది కాలనీవాసులు నిరాశ చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి సమస్య కారణంగానే స్థానికులు వలుసలు వెళ్తున్నారని తెలిపారు. పంచాయతీలో నిధుల కొరత లేనప్పటికీ చర్యలు చేపట్టకపోవడం బాధాకరమన్నారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేకపోతే జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. సిపిఐ మానవ హక్కుల సంఘం చిదానంద, నవ్యాంధ్ర ఎంఆర్‌పిఎస్ నాయకులు దేవ పుత్ర, కెవిపిఎస్ నాయకులు అనిల్, మాధవరం గ్రామస్తులు సురేష్, మారెప్ప, హనుమంతు, రాజు, అశోక్ పాల్గొన్నారు.

కూలీలకు నీటి వసతి కల్పించాలి

- వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు తిక్కన్న గౌడ్

సమావేశంలో మాట్లాడుతున్న వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు తిక్కన్న గౌడ్

ప్రజాశక్తి - పెద్దకడబూరు

ప్రభుత్వం ఉపాధి కూలీలకు నీటి వసతి కల్పించాలని వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు తిక్కన్న గౌడ్ కోరారు. శుక్రవారం మండలంలోని చిన్న తుంబలం గ్రామంలో ఉపాధి కూలీల పని ప్రదేశంలో ఎపిఒ రామన్నతో కలిసి సమావేశం నిర్వహించారు. కూలీల పని తీరు, వారికి రావాల్సిన వేతనాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈశ్వరమ్మకు జాబ్ కార్డు ఉందని, పని ప్రదేశంలో ఆమె చేయి విరిగిపోయిందని తెలిపారు. ప్రభుత్వం ఎలాంటి సహాయమూ అందించలేదని తోటి కూలీలు తెలిపారు. దీని దృష్టిలో పెట్టుకొని వెంటనే ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని కోరారు. వ్యకాస జిల్లా ఉపాధ్యక్షులు ఈడిగ తిక్కన్న గౌడ్, ఎపిఒ రామన్న, టెక్నికల్ అసిస్టెంట్ ఇజ్రాయిల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఖాదర్ బాషలు ఈశ్వరమ్మ ఇంటి దగ్గరకెళ్లి ఆమెను పరామర్శించారు. ఆమె మెడికల్ రిపోర్టులను తనిఖీ చేశారు. ఉపాధి కూలీలకు మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. నీడ వసతి, తాగునీటి సౌకర్యం కల్పించాలని కోరారు. 200 రోజులు పని దినాలు కల్పించాలని, రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలు పనికెళ్లే ప్రదేశానికి రాను, పోను రవాణా చార్జీలు ఇవ్వాలని కోరారు.

ప్రమాణ స్వీకారోత్సవానికి తరలిరావాలి

- ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ

ప్రజాశక్తి - చిప్పగిరి

ఈనెల 29న ఆలూరు మార్కెట్ యార్డు దగ్గర ఉన్న ఇబ్రహీం ఫంక్షన్ హాలు దగ్గర జరిగే ప్రమాణ స్వీకారోత్సవానికి వైసిపి కుటుంబ సభ్యులందరూ తరలి రావాలని మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు నారాయణ కోరారు. శుక్రవారం ఆయన స్వగ్రామం గుమ్మనూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సమక్షంలో ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్నానని తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశీస్సులతో, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సహకారంతో వైసిపి అభివృద్ధికి అంకితభావంతో పని చేసినందుకు ఈ పదవి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాబోయే కాలంలో ఆలూరు మార్కెట్ యార్డు రూపురేఖలు మారుస్తానని తెలిపారు. మార్కెట్‌కు వచ్చిన రైతులకు ఏ ఇబ్బందులూ కలుగకుండా తగిన వసతులను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానన్నారు. అసెంబ్లీ బూత్ కన్వీనర్ రాజన్న, వైసిపి నాయకులు గురునాథ్, శ్రీధర్, అజయ్, నారి పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు నూతన సొబగులు

- నాడు-నేడుతో మారిన పాఠశాల రూపురేఖలు

ప్రజాశక్తి - ఆదోని

వేగంగా జరుగుతున్న గదుల నిర్మాణం

రాష్ట్రంలో ప్రాథమిక విద్యను బలోపేతం చేసే దిశగా అడుగులు పడుతున్నాయి. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగానే నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చర్యలు తీసుకున్నారు. గతంలో గదులు చాలక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం నాడు-నేడుతో అదనపు గదుల నిర్మాణం చేపడుతుండడంతో ఆ సమస్య తీరిందని తల్లిదండ్రులు చెబుతున్నారు. పట్టణంలోని ఆర్‌ఆర్ లేబర్ కాలనీ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు నూతన సొబగులు వచ్చాయని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

గతంలో ఇరుకు గదులతో ఇబ్బందులు

లేబర్ కాలనీలో ఉన్న మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు విద్యనభ్యసించేవారు. సుమారు 600 మంది విద్యార్థులు వచ్చేవారని, ఆరు గదులతో ఇబ్బందులు ఉండేవారమని ఉపాధ్యాయులు తెలిపారు.

తీరిన గదుల కొరత

పట్టణంలోని లేబర్ కాలనీ మున్సిపల్ ఉన్నత పాఠశాల రూపురేఖలు మారాయి. నాడు-నేడు కింద రెండో విడతలో హైస్కూల్ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. సుమారు రూ.2.20 కోట్ల వ్యయంతో 20 గదుల నిర్మాణానికి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. విద్యార్థులకు కనీస అవసరాలు కల్పించేందుకు, మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం అందుబాటులోకి తెచ్చారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోపు గదులను అందుబాటులోకి తెస్తామని ప్రధానోపాధ్యాయులు రమేష్ నాయుడు తెలిపారు. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 837 మందికి పెరిగిందని చెప్పారు. తరగతి గదిలో కుర్చీలు, బెంచీలు, బ్లాక్ బోర్డులు, ఫ్యాన్లు, విద్యుత్ సౌకర్యం ఉండడం వల్ల పేద, ధనిక తేడా లేకుండా విద్యార్థులు చేరుతున్నారని తెలిపారు. సౌకర్యాలు కల్పించడం వల్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇదే పాఠశాల గతంలో డివిజన్ స్థాయిలో మోడల్ స్కూల్‌గా గుర్తింపు పొందింది. అదే తరహాలోనే విద్యను బోధిస్తున్నామని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

త్వరలోనే పనులు పూర్తి చేయిస్తాం

- రమేష్ నాయుడు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు

పాఠశాల పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ నకుల రాజు, సచివాలయ కమ్యూనిటీ సెక్రటరీ నాగరాజు, తల్లిదండ్రుల సహకారంతో పాఠశాల దినదిన అభివృద్ధి చెందుతోంది. ప్రస్తుతం నాడు-నేడు కింద 20 గదుల నిర్మాణం జరుగుతుండడం వల్ల గదుల సమస్య తీరింది. పాఠశాలలో చేరే వారి సంఖ్య కూడా రోజురోజుకూ పెరుగుతోంది. మెరుగైన విద్యనందించేందుకు కృషి చేస్తున్నాం. ఉపాధ్యాయుల కొరత ఉన్న విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అందరి సహకారంతో మెరుగైన ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తాం. విద్యాసంస్థల ప్రారంభంలోపు గదులను అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నాం.

వాలంటీర్లు మెరుగైన సేవలందించాలి

- ఎంపిడిఒ గౌరీదేవి, సర్పంచి అరుణ్‌కుమార్

ప్రజాశక్తి - దేవనకొండ

ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధులుగా పని చేస్తూ సంక్షేమ పథకాలను చేరవేస్తున్న వాలంటీర్లు సేవలను మరింత మెరుగుపరచుకోవాలని ఎంపిడిఒ గౌరీ దేవి, ఎంపిపి లక్ష్మీదేవి భర్త ఉమాంబ, సర్పంచి అరుణ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని తెర్నేకల్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో వాలంటీర్లకు సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వాలంటీర్లు ఇంకా బాగా పని చేసి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవలను అందించాలన్నారు. గ్రామానికి చెందిన కరిష్మాకు సేవారత్న, ప్రశంసాపత్రం, శాలువాతో సన్మానించి సిల్వర్ మెడల్ అందజేశారు. మిగిలిన వాలంటీర్లకు సేవా మిత్ర ప్రశంసా పత్రం అందించి సన్మానించారు. ఉప సర్పంచి సులోచనమ్మ భర్త బెల్ ఈరన్న, ఎంపిటిసి నామాల శ్రీను, వార్డు మెంబర్లు కట్టమీది వెంకటేష్, దొడ్డప్ప, సువర్ణ భర్త బడేసాబ్, మహాలక్ష్మి భర్త చిన్నరాముడు, పంచాయతీ కార్యదర్శులు తలారి రాముడు, సునీత, వైసిపి కార్యకర్తలు నాగన్న, కుమ్మరి మోహన్, చాకలి తిమ్మప్ప పాల్గొన్నారు.

వాలంటీర్లను సన్మానిస్తున్న సర్పంచి అరుణ్ కుమార్

సేవారత్న అవార్డుకు ఎంపికైన సావిత్రికి సన్మానం

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని చెట్నిహల్లి గ్రామానికి చెందిన వాలంటీరు బావిగడ్డ సావిత్రిని ప్రభుత్వం సేవారత్న అవార్డుకు ఎంపిక చేసింది. శుక్రవారం ఎంపికైన సావిత్రిని స్థానిక గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి భార్గవి, సర్పంచి అంజనేయులు, ఎంపిటిసి రామాంజనేయులు సన్మానించారు. అవార్డుతో పాటు శాలువా కప్పి అభినందనలు తెలిపారు. సచివాలయ సిబ్బంది వరప్రసాద్, మహిళా పోలీసు అరుణ, డిజిటల్ అసిస్టెంట్ రాధ, తోటి వాలంటీర్లు పాల్గొన్నారు.

సావిత్రిని సన్మానిస్తున్న సర్పంచి, ఎంపిటిసి

పెద్ద చెరువు సమస్యను పరిష్కరించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు - సిపిఎం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

30 ఏళ్లుగా కోర్టులో పెండింగ్‌లో ఉన్న పాండవగల్ పెద్ద చెరువు సమస్యను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో 26, 27, 28న గ్రామస్తులు చేపట్టే రిలే నిరాహార దీక్షలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కె.వెంకటేశులు, సిపిఎం మండల కార్యదర్శి కె.లింగన్న మాట్లాడారు. కోర్టులో ఉందనే పేరుతో ప్రభుత్వం పెద్ద చెరువు సమస్యను నిర్లక్ష్యం చేస్తోందని తెలిపారు. గత 30 ఏళ్లుగా చెరువు సమస్య పరిష్కారం కోసం సిపిఎం పోరాడుతూనే ఉందని చెప్పారు. పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం కొనసాగుతుందని తెలిపారు. సబ్ కోర్టు, జిల్లా స్థాయి కోర్టు, హైకోర్టులో కూడా ప్రభుత్వ చెరువు అని తీర్పులు వెలువడినప్పటికీ స్వాధీనం చేసుకోవడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహించడంతో ఆక్రమణదారు విజయలక్ష్మి అప్పీల్‌కు వెళ్లారని చెప్పారు. ఇప్పటికే ఎన్నో కేసులు కూడా గ్రామస్తులు భరించారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి చెరువు సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆమరణ నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ నిరాహార దీక్షలో సిపిఎం మండల కమిటీ సభ్యులు జె.రామాంజనేయులు, సిపిఎం శాఖ కార్యదర్శులు గోవిందు, హనీఫ్ బాషా, సిపిఎం శాఖ సభ్యులు కె.నర్సిరెడ్డి, డిజె.నర్సిరెడ్డి, కె.హనుమంతు రెడ్డి, యు.హనుమంతు రెడ్డి, వై.తాయన్న, యు.తాయప్ప, ఎస్.షేక్షావలీ కూర్చున్నారు. ఈ దీక్షలకు సిపిఎం మండల నాయకులు హనుమంతురెడ్డి, రైతు సంఘం మండల అధ్యక్షులు శేఖర్, సిపిఎం నాయకులు వెంకటేష్, ఆటో యూనియన్ (సిఐటియు) నాయకులు వీరేష్, ఉరుకుంద, డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు శ్రీకృష్ణ, ఉపాధ్యక్షులు చిరంజీవి, రమేష్ మద్దతు తెలిపారు. సిపిఎం శాఖ కార్యదర్శి పాండురంగ, శాఖ సభ్యులు కృష్ణ, బాష, గ్రామస్తులు పాల్గొన్నారు.

దీక్షలను ప్రారంభించి మాట్లాడుతున్న వెంకటేశులు

దేవదాయ కమిషనర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే

దేవాలయ కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే ఎర్రకోట

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విజయవాడ కార్యాలయంలో దేవదాయ, ధర్మాదాయ శాఖా కమిషనర్ ఎస్.సత్యనారాయణను ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. శుక్రవారం ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి నియోజకవర్గ అభివృద్ధిపై, దేవదాయ శాఖ నిధులను కేటాయించాలని కోరారు.

చిప్పగిరి నుంచి మద్దికెర రోడ్డు పనులు త్వరలోనే ప్రారంభం

- ఎంపిపి జూటూరు హేమలత

ప్రజాశక్తి - చిప్పగిరి

మండల ప్రజలు ఎప్పుడెప్పుడా ఎదురు చూస్తున్న చిప్పగిరి నుంచి వెళ్లే మద్దికెర వరకు ఆర్‌అండ్‌బి రోడ్డు పనులు చేసేందుకు అన్ని అంతరాలు తొలిగిపోయాయని, త్వరలోనే పనులు చేపడుతున్నట్లు ఎంపిపి జూటూరు హేమలత తెలిపారు. శుక్రవారం మండల కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చిప్పగిరి నుంచి మద్దికెర వరకు రూ.10 కోట్లతో ఆర్‌అండ్‌బి రోడ్డు పనులు చేసేందుకు టెండర్ పనులు కూడా ముగిశాయన్నారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. చిప్పగిరి నుంచి మద్దికెరకు రోడ్డు వేయడం వల్ల పత్తికొండ పట్టణానికి వెళ్లేందుకు, నంచర్ల, దౌల్తాపురం గ్రామాల ప్రజలు మండలానికి చేరుకొనేందుకు సులభతరం అవుతుందన్నారు. వైసిపి యువ నాయకులు జుటూరు మారయ్య పాల్గొన్నారు

ముఖ్యమంత్రి సభను విజయవంతం చేద్దాం

ఈనెల 30న రైతు భరోసా తొలి విడత నిధులను విడుదల చేసేందుకు వస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ఘనస్వాగతం పలికి సభను విజయవంతం చేయాలని వైసిపి ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలను ఎంపిపి దంపతులు జూటూరు హేమలత, మారయ్య కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం : ఎంపిడిఒ

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరు మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ అల్లాబకాష్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని పంచాయతీల్లో పారిశుధ్యం, ఒటిఎస్, గృహ నిర్మాణాలు, తాగునీరు, విద్య, వైద్యం, వ్యవసాయం, 15వ ఆర్థిక సంఘం నిధులు ఇతర సమస్యలపై చర్చించి తీర్మానాలు చేసి పనులు చేపట్టేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి మండల, నియోజకవర్గ, జిల్లాస్థాయి సభ్యులు, మండల ఆయా శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

మృతుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పిస్తున్న వైద్య ఉద్యోగులు

మెడికల్ ఆఫీసర్ రవీంద్ర రెడ్డి మృతికి సంతాపం

ప్రజాశక్తి - ఆదోని

గతంలో ఆదోని మెడికల్ ఆఫీసర్‌గా పని చేసిన డాక్టర్ రవీంద్ర రెడ్డి మృతిపై ప్రస్తుత ఆదోని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేకున్ భాను, ఎంపిహెచ్ఎస్ బాబురాజు, డిపిఎంఒ సీతారాముడు సంతాపం తెలిపారు. శుక్రవారం ఆదోనిలోని ఆర్‌టిపిసిఆర్ ట్యాబ్‌లో చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కోవిడ్ సమయంలో డివిజన్‌లోని వైద్య సిబ్బందిలో మనోధైర్యాన్ని నింపి ఆయన చేసిన సేవలను కొనియాడారు. టిబి యూనిట్, లెప్రసీ, డిప్యూటీ డిఎంహెచ్ఒ, ఏరియా ఆస్పత్రి సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

మాలల సింహగర్జనను జయప్రదం చేయండి

- మద్దికెర అంజి

ప్రజాశక్తి - దేవనకొండ

మాలల హక్కుల కోసం, సమస్యల పరిష్కారం కోసం ఈనెల 31న ఆలూరులో జరగనున్న మాలల సింహ గర్జనను జయప్రదం చేయాలని మాల మహానాడు జిల్లా సీనియర్ నాయకులు మద్దికెర అంజి కోరారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత అనేక ఏళ్లుగా మాలల హక్కులు పరిష్కారానికి నోచుకోక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వాలు గుర్తించి తమ హక్కులు, సమస్యల పరిష్కారానికి చొరవ చూపకపోతే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. మాలల సింహగర్జనకు అన్ని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

ఈ ఏడాదైనా అప్పులు తీరేనా..?

- ప్రారంభం కానున్న 'ఖరీఫ్' - పత్తి, మిర్చి పంటలపై మొగ్గు
- లాభసాటిగా పంటలు వచ్చేనా..? - గిట్టుబాటు ధర దొరికేనా..? - రైతుల్లో చిగురుస్తున్న కొత్త ఆశలు

ప్రజాశక్తి - హోళగుంద

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. పత్తి, మిర్చి పంటలపై ఎక్కువ మంది రైతులు మొగ్గు చూపుతున్నారు. పంటలు లాభసాటిగా పండి మద్దతు ధర దొరికితే గత రెండేళ్లుగా అతివృష్టి, అనావృష్టి కారణంగా చేసుకున్న అప్పులు ఈ ఏడాది తీర్చవచ్చని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. అప్పులన్నింటినీ తీర్చేసి, బెంగళూరు, ముంబయి, గుంటూరు వంటి సుదూర ప్రాంతాలకు వలస వెళ్లకుండా పిల్లాపాపలతో హాయిగా ఊళ్లోనే ఉండవచ్చని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే బ్యాంకు అధికారులు సకాలంలో రైతులకు పంట రుణాలు మంజూరు చేయాల్సిన అవసరం ఉంది. వ్యవసాయ అధికారులు సలహా, సూచనలు కూడా తోడు కావాలి.

సకాలంలో సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అందించాలి :

రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సకాలంలో సబ్సిడీ విత్తనాలు, ఎరువులు అందించి ఆదుకోవాల్సిన అవసరం ఉంది. సరైన సమయంలో ఎరువులు, విత్తనాలు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నకిలీ విత్తనాలపై నిఘా కరువు

వ్యవసాయ అధికారులు తూతూమంత్రంగా ఎరువులు, క్రిమిసంహారక మందుల షాపులను తనిఖీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. ఇంకెక్కడ నాణ్యమైన విత్తనాలు, ఎరువులు తమకు దొరుకుతాయని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో నకిలీ విత్తనాల కేసులు నమోదైనప్పటికీ నకిలివా, నాణ్యమైన విత్తనాలా అని తేల్చేందుకు వ్యవసాయ అధికారులు పరీక్ష కోసం ల్యాబ్‌కు పంపమంటారు. అవి ఇప్పటివరకు తేలని పరిస్థితి ఉంది. ఇక్కడ కూడా రైతులకు అన్యాయమే జరుగుతోంది.

ప్రభుత్వ తోడ్పాటు అంతంత మాత్రమే

రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎంఆర్‌పి ధరలకే ఎరువులు, విత్తనాలు అందిస్తామని ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటోంది. రైతు భరోసా కేంద్రాల్లో రైతుకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు లేకపోవడంతో ప్రయివేట్ షాపుల్లో అధిక ధరలకు కొనుగోలు చేసి రైతులు అప్పుల పాలవుతున్నారు. రైతు శ్రేయస్సే ప్రభుత్వ శ్రేయస్సని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వాలకు రైతులను ఆదుకోవాలని ఆలోచన లేకపోవడం బాధాకరం.

జూన్ 3న ఉచిత కంటి వైద్య శిబిరం

- ఆర్యవైశ్య సంఘం నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

కంటి జబ్బులతో బాధపడే వారికి చికిత్స అందించేందుకు జూన్ 3న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనాథ్ గుప్త, మిర్యాల శ్రీధర్ తెలిపారు. శుక్రవారం ఆదోని పట్టణంలోని ఎస్‌కెడి కాలనీలో శిబిరానికి సంబంధించిన కరపత్రాలను సంఘం వైస్ ప్రెసిడెంట్ ప్రతాప్, ఈరన్న శెట్టి, రంగనాయకులు, మహిళా విభాగ్ ప్రెసిడెంట్ సంగీత, సెక్రటరీ మమత, ట్రెజరర్ బిందు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆర్యవైశ్య అఫీషియల్ అండ్ ప్రొఫెషన్ ఆధ్వర్యంలో సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగానే పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో జూన్ 3న కంటి చికిత్స వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. అవసరమైన వారికి ఆపరేషన్, భోజన వసతి, రవాణా సౌకర్యం, అద్దాలు, మందులు ఉచితంగా ఇస్తున్నామన్నారు. కర్నూలు విశ్వ భారతి ఆస్పత్రి వైద్యులు సురేష్ కుమార్, వైద్య బృందం ఆధ్వర్యంలో రోగులకు కంటి పరీక్షలు, చికిత్సలు అందిస్తారని తెలిపారు. కుల, మత, ప్రాంతీయ భేదం లేకుండా అందరికీ పరీక్ష చేస్తారన్నారు. కంటిచూపు సమస్య ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కరపత్రాలను విడుదల చేస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎఒ వరప్రసాద్

ప్రజాశక్తి - పెద్దకడబూరు

ఖరీఫ్ సీజన్‌కు రాష్ట్ర ప్రభుత్వం అందజేసే సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఎఒ వరప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేరుశనగ, జీలుగా, పిల్లి పెసర విత్తన పంపిణీ కోసం అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. సబ్సిడీ మినహాయించి రైతులు డబ్బులు చెల్లిస్తే ఎపి సీడ్స్ కార్పొరేషన్ నుంచి నేరుగా రైతు భరోసా కేంద్రాల వద్ద విత్తనాల పంపిణీ జరుగుతుందని తెలిపారు. వేరుశనగ క్వింటా పూర్తి ధర రూ.9300 కాగా 40 శాతం రాయితీ రూ.3720 మినహాయించి, రైతు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. జీలుగా క్వింటా పూర్తి ధర రూ.7900 కాగా 50 శాతం రాయితీతో రూ.3950 మినహాయించి రైతు కట్టాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పిల్లి పెసర క్వింటా పూర్తి ధర రూ.9700 రాయితీ మినహాయించి రైతు కట్టాల్సి ఉంటుందని తెలిపారు.

మహిళా ఆత్మహత్య

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండ గ్రామానికి చెందిన వివాహిత హరిజన సుగంధ (35) శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. పత్తికొండ మండలం హోసూరు గ్రామం భర్త ఇంటి నుంచి గత ఆరు నెలల క్రితం పుట్టింటికి వచ్చి ఇక్కడే తల్లిదండ్రుల దగ్గర ఉంటున్నారు. కుటుంబ సమస్యలతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు

- వైసిపి రాష్ట్ర యువ నేత ప్రదీప్ రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

పథకాలను వివరిస్తున్న ప్రదీప్ రెడ్డి

రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వమని వైసిపి రాష్ట్ర యువ నాయకులు వై.ప్రదీప్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని నదీచాగి గ్రామంలో 'గడపగడపకు మన ప్రభుత్వం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదేనని తెలిపారు. గ్రామాల్లో అర్హులకు సంక్షేమ పథకాలు అందకపోతే వారిని గుర్తించి అందించాలని అధికారులకు ఆదేశించారు. మంత్రాలయం నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే వై.బాలనాగరెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. గ్రామంలో విద్యుత్ స్తంభాల సమస్య ఉందని వారి దృష్టికి తీసుకురావడంతో పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం : పదో తరగతి పరీక్షల్లో 80 శాతం మార్కులు సాధించిన విద్యార్థిని నాగవేణి కుటుంబానికి ప్రదీప్ రెడ్డి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఇంటర్మీడియట్ అడ్మిషన్ కోసం ఈ ఆర్థిక సహాయం అందజేశారు. విద్యాభివృద్ధి కోసం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోందన్నారు. వైసిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద చారి, మండల నాయకులు మాబు సాబ్, రామన్న గౌడ్, సర్పంచి మహేష్, ఎంపిటిసి లింగన్న గౌడ్ పాల్గొన్నారు.

'విద్యతో కార్పొరేట్ స్కూళ్ల వ్యాపారం'

ంప్రజాశక్తి - ఆదోని

అక్షరాలతో రూ.లక్షల వ్యాపారం చేస్తున్న ప్రయివేట్, కార్పొరేట్ స్కూళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్‌పిఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల ముందస్తు అడ్మిషన్లు, ప్రచారాలు చేసే విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పట్టణంలోని ఆర్ట్స్ కళాశాలలో రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్‌పిఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నవీన్ కుమార్, జిల్లా కార్యదర్శి బాలు మాట్లాడారు. పట్టణంలో అక్షరాలతో వ్యాపారం చేస్తున్న ప్రయివేట్, కార్పొరేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యా సంవత్సరం ముగియక ముందే విద్యార్థుల తల్లిదండ్రులను మభ్యపెడుతున్నాయని తెలిపారు. ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తూ, నిలువు దోపిడీకి పాల్పడుతున్నాయని చెప్పారు. విద్యాధికారులు నిర్లక్ష్యం వీడి నిబంధనలకు విరుద్ధంగా నడిపే పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. వీరేష్, జనార్ధన్, అరవింద్, రాజు, కిరణ్ పాల్గొన్నారు.

చంద్రశేఖర్‌కు హ్యూమన్ రైట్స్ అవార్డు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో నివసిస్తున్న సూక్ష్మ కళాకారుడు డాక్టర్ బారికి చంద్రశేఖర్ గతేడాది నుంచి హ్యూమన్ రైట్స్ ఇంటర్నేషనల్ ఫెడరేషన్ కర్నూలు జిల్లా ప్రెసిడెంట్‌గా పని చేస్తున్నారు. శుక్రవారం హ్యూమన్ రైట్స్ అవార్డును పోస్టు ద్వారా అందుకున్నారు. ఎమ్మిగనూరు వాసులైన కదిరికోట శాంతి రాజు, చల్లా కృష్ణ చైతన్య, ఎరుకల రామాంజినేయులుకు హ్యూమన్ రైట్స్ ఇంటర్నేషనల్ ఫెడరేషన్ వారి ద్వారా అందిన ఐడి కార్డులను ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడారు. హ్యూమన్ రైట్స్ ద్వారా అవార్డును అందుకోవడమే కాకుండా లింకా బుక్ ఆఫ్ రికార్డ్, జాతీయ అవార్డు గ్రహీత డాక్టర్ బారికి చంద్రశేఖర్‌కు ఈ అవార్డులు తన చేతుల మీదుగా అందుకోవడం ఆనందనీయమని కొనియాడారు. యువత మేల్కోవాలని, మంచి పనులకు స్ఫూర్తి కావాలని ఆకాంక్షించారు.



పట్టుబడిన తమిళ కూలీలు, రెండు ఎర్రచందనం దుంగలతో ఫారెస్ట్ సిబ్బంది

సమస్యల్లో వారపు సంతలు

- స్థలాలు లేక రోడ్లపైనే నిర్వహణ
- ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు, ప్రజలు

ముసలమడుగు గ్రామంలో రోడ్డుపైనే జరుగుతున్న సంత

ప్రజాశక్తి - కొత్తపల్లి

కొత్తపల్లి మండలంలో జరుగుతున్న వారపు సంతలు సమస్యల నడుమ కొనసాగుతున్నాయి. సంతల నిర్వహణకు సరైన స్థలాలు లేకపోవడంతో రోడ్లపైనే వ్యాపారాలు నిర్వహించుకోవాల్సి పరిస్థితి ఏర్పడింది. గ్రామీణ ప్రాంతాల ప్రజలు నిత్యవసర సరుకులు, కూరగాయలు ఇతర వాటి కోసం పట్టణ ప్రాంతాలకు వెళ్లకుండా గ్రామాల్లోనే వారపు సంతలకు వెళ్లి కొనుగోలు చేస్తుంటారు. అయితే వారపు సంతల్లో వ్యాపారాలు నిర్వహించుకునేందుకు విశాలమైన స్థలాలు లేకపోవడంతో వ్యాపారులు, గ్రామాల నుంచి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కొత్తపల్లి మండలంలో 12 గ్రామ పంచాయతీలకు గాను మజరాలతో కలిపి సుమారు 28 గ్రామాలు ఉన్నాయి. వారంలో సోమవారం మొదలుకొని శనివారం వరకూ ప్రతి రోజూ మండలంలోని ఒక గ్రామంలో వారపు సంత జరుగుతుంది. సోమవారం మండలంలోని ఎర్రమఠం గ్రామంలో వారపు సంత జరుగుతుంది. సంతకు సరైన స్థలం లేకపోవడంతో ప్రధాన రహదారికి ఇరువైపులా వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఈ సంతకు పాత మాడుగుల, కపిలేశ్వరం, సంగమేశ్వరం, సిద్దేశ్వరం, జానాల గూడెం తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు వస్తారు. రహదారికి ఇరువైపులా సంత జరుగుతుండడంతో వాహనదారులకు, ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. మంగళవారం ఎం.లింగాపురం గ్రామంలో ప్రధాన రహదారి పక్కన రోడ్డుపై సంత నిర్వహిస్తారు. ఈ సంతకు గోకవరం గ్రామం నుంచి ప్రజలు వస్తారు. వర్షాకాలం అయితే మురికి కుంటల మధ్యనే సంత చేసుకోవాల్సిన పరిస్థితి ఉంటుంది. బుధవారం శివపురం గ్రామంలో పాఠశాల ఆవరణంలో సంత నిర్వహిస్తారు. ఈ సంతకు శివపురం గూడెం, బట్టువారి పల్లి, సింగరాజుపల్లి గ్రామాల ప్రజలు వస్తారు. గురువారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సంత స్థలంలో వ్యాపారాల నిర్వహణ చేస్తారు. సంతకు వీరాపురం గ్రామానికి చెందిన ప్రజలు వస్తారు. శుక్రవారం ముసలిమడుగు గ్రామంలో ప్రధాన సెంటర్లో ఉన్న రహదారిపై సంత నిర్వహణ జరుగుతుంది. శనివారం గువ్వలకుంట్ల గ్రామంలో రోడ్డుపై సంత నిర్వహణ జరుగుతుంది. ఈ సంతకు బండి నాయిని పాలెం, పాలెం చెరువు గ్రామాల ప్రజలు వస్తారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం మొదలుకొని శనివారం వరకు ప్రతిరోజు ఏదో ఒక గ్రామంలో సంత జరుగుతుంది. ఈ సంతలకు ఆకుకూరలు, కూరగాయలు, తినుబండారాలు, నిత్యవసర సరుకులు అమ్ముకొనేందుకు వ్యాపారస్తులు వస్తారు. అయితే సంతలకు స్థలాలు లేక రోడ్లపైనే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉంది. మరోవైపు గ్రామంలో సాయంత్రం అయితే సంత రోజు మాత్రం పశువులు, పొలాలకు వెళ్లిన ఎద్దుల బండ్లు వస్తున్నప్పుడు వ్యాపారస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం అయితే లింగాపురం, ముసలమడుగు, ఎర్రమఠం గ్రామాల్లో వర్షపు నీటిలోనే సంతలు నిర్వహిస్తున్న పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా గ్రామాల్లో జరుగుతున్న సంతలకు ప్రత్యేకంగా స్థలాలు కేటాయించాలని వ్యాపారులు, ఆయా గ్రామాల ప్రజలు జిల్లా ఉన్నతాధికారులను కోరుతున్నారు.

స్థలాలు లేక ఇబ్బందిగా ఉంది

ప్రతి రోజు గ్రామాల్లో జరుగుతున్న సంతలకు ప్రత్యేకంగా స్థలాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉంది. గ్రామాల్లో రోడ్లపైనే సంతలు నిర్వహిస్తుండడం వాహనాలకు, ఎద్దుల బండ్లకు, ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. వర్షాకాలం అయితే వర్షపు నీటి పక్కనే సంతల నిర్వహిస్తున్నప్పుడు ఒకవైపు వరద నీరు, మరోవైపు సంతలు జరుగుతుంటాయి. సంతల కోసం ప్రత్యేకంగా స్థలాలు కేటాయిస్తే బాగుంటుంది.

- రాఘవ, తినుబండారాల వ్యాపారస్తుడు.

9 మంది తమిళ కూలీలు అరెస్ట్

- రెండు ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి - రుద్రవరం

నంద్యాల-కడప జిల్లాల నల్లమల అటవీ సరిహద్దులో 9 మంది తమిళ కూలీలను అరెస్టు చేసి రెండు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు రుద్రవరం రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల డిఎఫ్ఒ వినీత్ కుమార్ ఆదేశాల మేరకు నంద్యాల డివిజన్, పొద్దుటూరు డివిజన్ ఫారెస్ట్ సరిహద్దులో ఉన్న చింతమాను రస్తా ప్రాంతంలో తమిళ కూలీలు ప్రవేశించారని సమాచారం అందడంతో ఫారెస్ట్ మొబైల్ సిబ్బంది, నూతల సిబ్బంది, అహోబిలం, రుద్రవరం, డి, వనిపెంట అటవీ ప్రాంతంలో దాడులు నిర్వహించినట్లు తెలిపారు.

ఇందులో భాగంగా ఎర్రచందనం చెట్లు నరికేందుకు వచ్చిన 9 మంది తమిళ కూలీలను అరెస్ట్ చేశామన్నారు. వారి వద్ద నుంచి రెండు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. పట్టుబడిన నిందితులను తిరుపతిలోని ఎర్రచందనం ప్రత్యేక కోర్టులో హాజరపరిచినట్లు తెలిపారు.

ఎఎస్‌పి అడ్మిన్‌గా జి.వెంకటరాముడుబాధ్యతలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఎస్పిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎఎస్‌పి అడ్మిన్

నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్‌పి అడ్మిన్‌గా జి.వెంకటరాముడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన జిల్లా ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. జి.వెంకటరాముడు 2012లో మొదటగా నెల్లూరు డిఎస్‌పిగా పోలీస్ డిపార్ట్మెంట్‌లో చేరారు. అనంతరం కర్నూలు జిల్లా ఆదోనిలో డిఎస్‌పిగా, సిఐడిలో ఇంటలిజెన్స్ కర్నూలు విభాగంలో డిఎస్‌పిగా పని చేసి అడిషనల్ ఎస్‌పిగా ప్రమోషన్ పొందారు. బదిలీపై నంద్యాల జిల్లాకు అడిషనల్ ఎస్‌పి అడ్మిన్‌గా వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి.వెంకటరాముడును ఏఆర్ అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, నంద్యాల టౌన్ డిఎస్‌పి సి.మహేశ్వర్ రెడ్డి, డిపిఒ ఏఒ నిజాముద్దీన్, ఏఈఎస్, సెబి శ్రీధర్ రావ్, నంద్యాల సబ్ డివిజన్ సిఐలు, ఎస్ఐలు మర్యాద పూర్వకంగా కలిశారు.

జాతీయ రహదారి నిర్మాణానికి మంత్రి భూమి పూజ

- జగనన్న కాలనీకి రోడ్ కమ్ బ్రిడ్జి ప్రారంభం

ప్రజాశక్తి - బేతంచెర్ల

ఓర్వకల్ మండలం సోమయాజుల పల్లె నుంచి బేతంచెర్ల మీదుగా డోన్ వరకూ చేపడుతున్న జాతీయ రహదారి-340 నిర్మాణానికి మండలంలోని హెచ్.కొట్టాలలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు. అంతకుముందు మంత్రి హెచ్ కొట్టాల రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజ నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడారు. రూ.630 కోట్ల అంచనాతో ఓర్వకల్ మండలం సోమయాజుల పల్లె నుంచి బేతంచెరంల మీదుగా డోన్ వరకూ 53 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ బేతంచెర్ల పట్టణంలోని జగనన్న కాలనీకి రూ.1.2 కోట్లతో చేపట్టిన కీలకమైన రోడ్ కమ్ బ్రిడ్జిని కలెక్టర్ మనజీర్ జిలాని సామూన్, ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బి ఏఈ పూని రామ్, ఈఈ ఇందిరమ్మ, డిఈ రామచంద్ర, రాధిక, బేతంచెర్ల మున్సిపల్ చైర్మన్ చలం రెడ్డి, ఎంపిపి నాగభూషణం, తహశీల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి, గోరుమాన్‌కొండ సర్పంచి కోడె వెంకటేశ్వర్లు, ముర్తుజావలి, ఖాజా హుస్సేన్, ఎద్దులన్న, తిరు మలేశ్వర్ రెడ్డి, జెడ్పిటిసి శివలక్ష్మమ్మ, ఎంపిటిసి రత్నమ్మ, హెచ్. కొట్టాల సర్పంచి వెంకట లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి బుగ్గన

కలెక్టర్ సంతకం ఫోర్జరీ నిందితుడు అరెస్టు

- జిల్లా ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి వెల్లడి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లా కలెక్టర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి వక్ఫ్ బోర్డ్ భూమిని పట్టా భూమిగా చేసిన కేసులో ముద్దాయి సాయబోయిన ఉపేంద్రను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ముద్దాయిని మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ మహానంది తహశీల్దార్ జనార్ధన్ శెట్టి ఫిర్యాదు మేరకు సంజామల మండల కేంద్రానికి చెందిన సాయబోయిన ఉపేంద్రపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మహానంది మండలం యూ.బొల్లవరం గ్రామానికి చెందిన శీనయ్యకి చెందిన సర్వే నంబర్ 486/2లో 2.66 ఎకరాల వక్ఫ్‌బోర్డ్ భూమిని నిషేధిత జాబితా నుండి తొలగిస్తానని కలెక్టర్ ప్రొసీడింగ్స్ కాపీని తన ల్యాప్‌టాప్‌లో తయారు చేసి కలెక్టర్ సంతకాన్ని ఫోర్జరీ చేసి తప్పుడు పత్రాన్ని సృష్టించాడని తెలిపారు. ఈ విషయంపై మహానంది తహసీల్దార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ముద్దాయిని నంద్యాలలోని ఎస్‌పివై రెడ్డి స్కూల్ వద్ద అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సాయబోయిన ఉపేంద్ర 2008 నుండి 2010 వరకు సంజామల మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో చిన్న చిన్న కంప్యూటర్ పనులు చేస్తూ రెవిన్యూ రికార్డుల మీద అవగాహన పెంచుకున్నాడని తెలిపారు. జూపాడుబంగ్లా మండలంలోని పారుమంచాల గ్రామంలో బుక్కపురం బొందిలి సుభాన్ సింగ్ చుక్కల భూమి సర్వే నంబర్ 373/ఎ, 373/బి1ని భార్య, బావ మరిది పేర డబ్బులు తీసుకొని ఆన్‌లైన్‌లో ఎక్కించాడని చెప్పారు. అలాగే బుక్కపురానికి చెందిన సంగా చిన్నయ్యకు వక్ఫ్ బోర్డు భూమి నుండి పట్టా భూమిగా చేసి ఆన్‌లైన్‌లో ఎక్కించడానికి జూన్ 10వ తేదీ నాటి కలెక్టర్ ప్రొసీడింగ్స్ పాతది తీసుకుని అందులో సంతకం వివరాలు మొత్తం జాయింట్ కలెక్టరు సంతకంతో ఎండార్స్‌మెంట్‌ను తన సొంత ల్యాప్‌టాప్, ప్రింటర్ ద్వారా ఫోర్జరీ చేసిన డాక్యుమెంట్స్ తయారు చేసి వాటిని ఒరిజినల్ డాక్యుమెంట్స్‌గా చెలామణి చేశారన్నారు. ముద్దాయి వద్ద నుండి ఒక డెల్ కంపెనీకి చెందిన ల్యాప్‌టాప్, ప్రింటర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 2018 నుండి జిల్లాలోని పలు మండలాలో అవకతవకలకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలిందని, దానిపై విచారణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి

ఆటో కార్మికులతో మాట్లాడుతున్న ఎస్ఐ వెంకట రెడ్డి

నిబంధనలు పాటించాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా నిర్దేశించిన ప్రాంతాలలో మాత్రమే ప్రయాణికులను ఎక్కించుకొని వారి గమ్యస్థానాలకు చేర్చాలని ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపారు. పోలీసు ఉన్నతాదికారుల ఆదేశాల మేరకు శుక్రవారం ఆళ్లగడ్డ పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద పట్టణంలో తిరుగుతున్న ఆటో కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ప్రతి ఒక్కరూ విధిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ఆర్సి, ఫిట్నెస్ ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. పట్టణంలో తిరిగే ప్రతి ఒక్క ఆటో డ్రైవర్ పిసి నెంబరు కలిగి ఉండాలని సూచించారు.

విత్తన దుకాణాలను అధికారులు తనిఖీ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలోని విత్తన దుకాణాలను వ్యవసాయ అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. కోవెలకుంట్ల ఏడిఏ కృష్ణమోహన్ రెడ్డితో పాటు ఆళ్లగడ్డ వ్యవసాయ అధికారి కిషోర్ రెడ్డి బృందం విత్తన దుకాణంలోని రికార్డులను తనిఖీ చేసి దుకాణదారులకు సూచనలు ఇచ్చారు. శ్రీ మహాలక్ష్మీ అగ్రి సీడ్స్, సత్య క్రాప్ సీడ్స్, జువారి ఫామ్ హబ్ దుకాణాలను తనిఖీ చేశారు. నాణ్యత కలిగిన విత్తనాలను రైతులకు విక్రయించాలని అధికారులు వారికి సూచించారు. నకిలీ విత్తనాలను అమ్మితే దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

ఉచితంగా మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

నంద్యాల పట్టణంలోని ఆంధ్ర ఫ్రేమ్స్ ప్రొప్రైటర్ వేణుగోపాల్ గత 30 రోజులుగా రోజుకు 100 లీటర్ల మజ్జిగ ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం స్థానిక సాయిబాబా గుడి దేవస్థానం వద్ద గత 30 రోజులుగా మజ్జిగ, మంచినీరు ఉచితంగా అందిస్తున్న వేణుగోపాలను నీడ్ ఫర్ హెల్ప్ సభ్యులు వసుమతి, శాంతకుమారి, భాగ్యలక్ష్మి, జానకిలు శాలువా కప్పి మొమెంటో అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నీడ్ ఫర్ హెల్ప్ సభ్యురాలు వసుమతి మాట్లాడుతూ బొల్లవరంకు చెందిన గోపాల్ గత 30 రోజుల నుంచి మజ్జిగ, తాగునీరు అందించడం గర్వించదగ్గ విషయమన్నారు. ఇటువంటి మంచి పని చేసే వారిని ప్రతి ఒక్కరూ అభినందించాలని కోరారు. ప్రతి ఒక్కరి సహాయ సహకారాలు వేణుగోపాల్‌కు ఉండాలని కోరారు. ఆంధ్ర ఫ్రేమ్స్ ప్రొప్రైటర్ వేణుగోపాల్ మాట్లాడుతూ వేసవికాలంలో ప్రజలకు తన వంతు సహాయ సహకారాలు అందించాలనే ఉద్దేశంతో రోజుకు 100 లీటర్ల మజ్జిగ, చల్లటి నీరు గత 30 రోజులుగా అందిస్తున్నామని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు. భవిష్యత్తులో కూడా అందరి సహకారం ఉంటే ఇటువంటి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించడానికి తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నీడ్ ఫర్ హెల్ప్ సభ్యులు, సత్య తేజ, మధు, వెంకటసుబ్బయ్య, సుధాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా మజ్జిగ పంపిణీ చేస్తున్న

కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కుట్టు మిషన్లు పంపిణీ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

అహోలం మఠం, శ్రీనివాస సేవా సంస్థ టివిఎస్ వారి ఆధ్వర్యంలో చెంచు మహిళలకు కుట్టు మిషన్లు అహోబిల మఠం ప్రతినిధి సంపత్, ఓఎస్డి శివ ప్రసాద్‌లు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అహోబిలం లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఉన్న చెంచు కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో శ్రీనివాస సేవ సంస్థ, టివిఎస్ వారి ఆధ్వర్యంలో 18 మంది చెంచు మహిళలకు కుట్టు మిషన్‌లో శిక్షణ ఇప్పించి కుట్టు మిషన్లు అందజేశా మన్నారు. ఈ కార్యక్రమంలో టీవీఎస్ ఏజీఎం బాలసుబ్రమణ్యం, సిడిఓఎం నితిన్ కృష్ణ, వీడివో సాయి తేజ, టైలరింగ్ టీచర్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు

- డాక్టర్ టి వినోద్ కుమార్

ప్రజాశక్తి - అవుకు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ వైద్య విధానం కార్యక్రమంలో భాగంగా ఇంటి ముంగిటకే ప్రజలకు వైద్య సేవలు అందించటం ఎంతో ఉపయోగకరమని డాక్టర్ టి.వినోద్ కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ఉప్పలపాడు పిహెచ్‌సి పరిధిలోని పిక్కిళ్ళపల్లి తండా, జూనుంతల గ్రామాలలో ఫ్యామిలీ వైద్య విధానం కార్యక్రమాన్ని నిర్వహించారు. రక్తహీనత, డయాబెటిస్, క్యాన్సర్, టిబి, గుండెకు సంబంధించిన వ్యాధులు, గర్భవతులు, బాలింతలకు, చిన్న పిల్లలకు పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ దానమ్మ, జ్యోత్స్న, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ నందీశ్వర్ రెడ్డి, శ్రీలేఖ, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి ముందరే వైద్యం చేస్తున్న డాక్టర్ టి వినోద్ కుమార్

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - రుద్రవరం : మండలంలోని ఎర్రగుడిదిన్నె గ్రామం మెట్ట దగ్గర మోటార్ సైకిల్‌ను కారు ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తుల వివరాల మేరకు.. శుక్రవారం రుద్రవరం గ్రామానికి చెందిన జయపాల్, కేజీయ, కీర్తనలు మోటార్ సైకిల్‌పై ఎర్ర గుడిదిన్నె గ్రామం మీదుగా నంద్యాలకు వెళుతుండగా మెట్ట దగ్గర రోడ్డు దాటుతుండగా కారు వచ్చి ఢీకొట్టింది. దీంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరందరిని చికిత్స నిమిత్తం రుద్రవరం 108 వాహనం ద్వారా నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వ్యవసాయ కళాశాల అధ్యాపకుడికి అవార్డులు

ప్రజాశక్తి - మహానంది

మహానంది మండలం ఎంసి.ఫారం గ్రామంలో ఉన్న ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ కళాశాలలో సేద్య విభాగం (ఆగ్రానమి)లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఏ.మల్లేశ్వర్ రెడ్డికి రెండు అవార్డులు వచ్చినట్లు ప్రిన్సిపల్ సుధాకర్ నాయక్ తెలిపారు. ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 55వ స్నాతకోత్సవంలో భాగంగా ఈనెల 22వ తేదీన బాపట్లలోని వ్యవసాయ కళాశాలలో జరిగిన స్నాతకోత్సవంలో గవర్నర్ చేతుల మీదుగా ఈ పథకాలను అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏ .మల్లేశ్వర్ రెడ్డి అందుకున్నారని తెలిపారు. మొదటి అవార్డు ఉత్తమ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తగా, గత ఎనిమిది సంవత్సరాలుగా ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వ్యవసాయ పరిశోధన స్థానం అనంతపురంలో మెట్ట వ్యవసాయంలో చేసిన ఉత్తమ పరిశోధనలకు అందుకున్నారని చెప్పారు. మరొక అవార్డు పిహెచ్‌డిలో యూనివర్సిటీ స్థాయిలో మొదటి స్థానాన్ని సాధించినందుకు ప్రొఫెసర్ ఎన్‌జి రంగా గోల్డ్ మెడల్ అవార్డు అందుకున్నారని తెలిపారు.

అవార్డులు అందుకుంటున్న ప్రొఫెసర్ ఎ.మల్లేశ్వర్ రెడ్డి

నేడు కళారాధన వేసవి శిక్షణ శిబిరం ముగింపు ఉత్సవం

ప్రజాశక్తి - నంద్యాల : కళారాధన సాంస్కృతిక సంస్థ, నంద్యాల లయన్స్ క్లబ్, నంద్యాల ఐఎంఏ సంయుక్త సహకారంతో గత నెల రోజులుగా నిర్వహిస్తున్న 22వ ఉచిత లలిత కళల వేసవి శిక్షణ శిబిరం ముగింపు ఉత్సవం శనివారం సాయంత్రం మున్సిపల్ టౌన్ హాల్లో నిర్వహిస్తున్నారు. 25 మంది కోచ్‌లతో 400 మంది బాల బాలికలు, యువతీ యువకులు ఈ శిక్షణా శిబిరంలో శిక్షణ పొందారు. శిక్షణ పొందిన బాలబాలికలచే సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తారు. కళాభిమానులందరూ పాల్గొనాలని కళారాధన అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ మధుసూదరావు, డాక్టర్ రవి కృష్ణ, క్యాంపు కోఆర్డినేటర్ రంగనాథ్ శుక్రవారం ఓ ప్రటనలో కోరారు.

మంత్రి బుగ్గనను సన్మానిస్తున్న ముస్లిం సోదరులు

మంత్రి బుగ్గనకు ముస్లింలు కృతజ్ఞతలు

ప్రజాశక్తి - బేతంచర్ల

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి బేతంచెర్ల ముస్లిం మైనారిటీ సోదరులు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ సభ్యులుగా ఎన్నికైన ఎస్ మూర్తుజావలి స్టేట్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్గా ఎన్నికైన ఎస్ కాజా హుస్సేన్‌లు, బేతంచెర్ల పట్టణ ముస్లిం మైనార్టీ సోదరులు కలిసి శుక్రవారం నాడు ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డికి శాలువాలు కప్పి పుష్పగుచ్చాలు ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్ మూర్చావలి, ఎస్ కాజా హుస్సేన్, మాట్లాడుతూ తమపైన నమ్మకంతో ఆర్థిక మంత్రి ఇచ్చిన ఈ పదవులను రాజకీయ పార్టీలకు అతీతంగా అందరికీ సేవ చేసి మంచి పేరు తీసుకువచ్చే విధంగా కృషి చేస్తామని వారన్నారు.

అనుమతి లేకుండా నిర్మాణాలు వద్దు

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వం విడుదల చేసిన జీవో. ఎంఎస్. నెంబర్ 40 ప్రకారము ఇరిగేషన్ డిపార్ట్మెంట్ నుండి 208.74 ఎకరాలు గ్రామపంచాయతీకి బదలాయించి నందు వలన గ్రామపంచాయతీ పరిధిలో ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణాలు గ్రామపంచాయతీ అనుమతి లేకుండా నిర్మాణాలు జరుగుచున్నచో వాటిని వెంటనే నిలిపివేయాలని సున్నిపెంటను గ్రామ పంచాయతీ ఒక ప్రకటనలో ఆదేశించారు. అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొన బడునని తెలియజేశారు. అలాగే గ్రామపంచాయతీ వారి అనుమతి లేకుండా రహదారుల ప్రక్కన షాపులు గాని నిర్మించరాదని, అక్రమ కొళాయిలు కనెక్షన్లు తీసుకోరాదని కాలనీ ప్రజలందరికీ సున్నిపెంట గ్రామపంచాయతీ సూచించింది.

విత్తనాల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

నకిలీ విత్తనాలు అమ్మితే లైసెన్సులు రద్దు

ప్రజాశక్తి - చాగలమర్రి

గ్రామాల్లోని వితనాలు విక్రయించే సీడ్స్ దుకాణాదారులు రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే దుకాణాల లైసెన్సులు రద్దు చేయడం జరుగు తుందని కోవెలకుంట్ల వ్యవసాయ సహాయ సంచాలకులు, వ్యవసాయశాఖ స్క్వాడ్ అధికారి క్రిష్ణమోహన్ రెడ్డి, ఏవో రంగనేతాజిలు హెచ్చరించారు. చాగలమర్రి పట్టణంలోని వెంకటసాయి సీడ్స్, శ్రీనిధి, మనగ్రోమోర్ సెంటర్, వీరభద్రసీడ్స్ దుకాణాలను శుక్రవారం తనిఖీ చేశారు. అనంతరం ఆయా దుకాణాల్లో రిజిస్టర్లు, బిల్లు పుస్తకాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుకాణాదారులు ఎప్పటికప్పుడు రికార్డులను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. విత్తనాలు విక్రయించే వాటి వివరాలతో రైతులకు రసీదులు ఇవ్వాలన్నారు. నకిలీ విత్తనాలు విక్రయించినా, తేదీ పూర్తయిన విత్తనాలు విక్రయించినట్లు తెలిస్తే ఆ దుకాణాల లైసెన్సులు రద్దు చేయడం జరుగుతుందని తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న కారు

- ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని ఎర్రగుడిదిన్నె గ్రామ మెట్ట దగ్గర మోటార్ సైకిల్‌ను కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు వివరాల మేరకు శుక్రవారం నాడు రుద్రవరం గ్రామానికి చెందిన జయపాల్, కేజీయ కీర్తన, మోటార్ సైకిల్‌పై ఎర్ర గుడిదిన్నె గ్రామం మీదుగా నంద్యాలకు వెళుతున్నారు. మెట్ట దగ్గర రోడ్డు దాటుతుండగా కారు వచ్చి ఢీకొట్టడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

వైభవంగా పల్లకి సేవ

ప్రజాశక్తి బనగానపల్లె

మండలంలోని నందవరం చౌడేశ్వరి దేవి దేవస్థానంలో పల్లకి సేవ మహోత్సవం వైభవంగా జరిగింది. శుక్రవారం నాడు చౌడేశ్వరి దేవి దేవస్థానంలో చౌడేశ్వరి దేవి ఉత్సవ విగ్రహాన్ని దేవస్థానం ప్రాంగణంలో ఈవో రామానుజన్ ఆధ్వర్యంలో పల్లకి సేవ మహోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

టిబి మందులు పంపిణీ

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని మూడవ సచివాలయ పరిధిలోని 6వ వార్డు చెందిన టీబీ వ్యాధిగ్రస్తులు మల్లికార్జునకు మందులను పంపిణీ చేశారు. శుక్రవారం పట్టణంలోని 3వ సచివాలయం ఏఎన్ఎం నాగేశ్వరమ్మ 6వ వార్డు మెంబర్ సురేష్‌లు మల్లికార్జునకు టీబీ మందులను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో వైసిపి నాయకులు మాబాష పాల్గొన్నారు.

మహానాడుకు తరలిన తెలుగు తమ్ముళ్లు

ప్రజాశక్తి - ఆత్మకూర్

రాజమండ్రిలో జరగనున్న మహానాడుకు శ్రీశైలం నియోజకవర్గం నుండి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు శుక్రవారం సాయంత్రం ప్రత్యేక వాహనాలలో భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా టిడిపి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు జట్టి వేణుగోపాల్, అబ్దుల్లాపురం బాష, మండల కార్యదర్శి శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రతినిధుల మహాసభకు నియోజవర్గం నుండి ముందుగానే బస్సులలో వెళుతున్నామని తెలిపారు. మహాసభకు ప్రత్యేక వాహనాలలో నియోజవర్గం నుండి వేలాది మంది కార్యకర్తలు బుడ్డ రాజశేఖర్ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా పెద్ద సంఖ్యలో బయలుదేరిన్నట్లు వారు తెలిపారు.

బస్సులలో తరలి వెళ్తున్న తెలుగు తమ్ముళ్లు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- జాయింట్ కలెక్టర్ టి. నిశాంతి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని, ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు తమ వంతు తోడ్పాటును అందించాలని జాయింట్ కలెక్టర్ టి. నిశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో పర్యావరణ పరిరక్షణపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి నిశాంతి మాట్లాడుతూ పర్యావరణ దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని ఈనెల 27 నుండి వచ్చే జూన్ 5వ తేదీ వరకు గ్రామ, మండల స్థాయిలలో ర్యాలీలు నిర్వహించి ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు. అలాగే పంచాయతీరాజ్, ఆరోగ్య శాఖ, మున్సిపల్, పర్యావరణం తదితర శాఖలు పర్యావరణ పరిరక్షణ అంశంపై ప్రతిరోజు నిర్వహించే కార్యక్రమాలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించి శనివారం సాయంత్రంలోగా డిఆర్ఓ కు పంపాలని ఆమె ఆదేశించారు. పబ్లిక్ కొళాయి నుండి వృధా నీటిని అరికట్టడం, మురికి కాలువలు శుభ్రం చేసుకోవడం, ప్లాస్టిక్ నిషేధం, మొక్కలు నాటడం తదితర పర్యావరణ పరిరక్షణ పనులపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ ఆఫీస్ ద్వారా ఫైల్స్ పంపుతూ పేపర్ వృధాను అరికట్టాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి పుల్లయ్య, పంచాయతీరాజ్, ఆరోగ్య శాఖ, మున్సిపల్, పర్యావరణం, గ్రామీణ నీటి సరఫరా సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

అధికారులు హాజరు కాకపోతే ఎలా?

- మండల సమావేశంలో ఎంపిపి అసహనం

ప్రజాశక్తి - పగిడ్యాల

మండల సమావేశానికి మండలంలోని ఆయా శాఖ అధికారులు హాజరు కాకపోతే ప్రజా సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. గత మండల సర్వసభ్య సమావేశంలో అధికారులు అందరూ హాజరుకావాలని ఎన్ని సార్లు చెప్పిన పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు. అధికారులు సక్రమంగా హాజర్ కాకపోతే ప్రజా సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని మండిపడ్డారు. మైనార్టీ కాలనీలో గత వారం రోజుల నుంచి నీటి సరఫరా కావడం లేదని కో ఆప్షన్ సభ్యుడు అస్లాం బాష సభ దృష్టికి తీసుకొచ్చాడు. రెండు రోజుల్లో నీటి సమస్యను పరిష్కా రం చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఇ శివకుమార్ సమాధానం ఇచ్చారు. ఎంతో కష్టపడి నిరుపేదలకు ఇండ్ల పట్టాలు ఇప్పిస్తే ఇండ్ల పట్టాలు ఇప్పిస్తే వారు ఇండ్లు నిర్మించుకుంటున్నారని ఇల్లు నిర్మించుకున్న వారికి సకాలంలో బిల్లులు చెల్లించడం లేదని ఎంపీపీ ప్రశ్నించారు. ఇండ్ల లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నామని హౌసింగ్ ఏఈ జ్యోతి సమాధానం ఇచ్చారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద మండలానికి 76 ఎకరాల పండ్ల పూల తోటలు పెంపకం కోసం టార్గెట్ ఇచ్చిందన్నారు. పండ్ల పూల తోటలో పెంపకం కోసం రైతులకు అవగాహన కల్పించే విధంగా ప్రజా ప్రతినిధులు సహకరించాలని ఏపీఓ మద్దిలేటి కోరారు. బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అందుకు సర్పంచులు ఎంపిటిసిలు సహకరించి బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని ఎంఈఓ సుభాన్ కోరారు. ఎంపీడీవో వెంకటరమణ మాట్లాడుతూ సమావేశానికి హాజరైన అధికారులపై జిల్లా ఉన్నత అధికారు లకు ఫిర్యాదు చేస్తానన్నారు. ప్రతి మండల సర్వసభ సమావేశానికి ఎంత పని ఉన్న అధికారులు తప్పకుండా హాజరు కవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.

భూ యజమానితో సంబంధం లేకుండా

కౌలు కార్డులు ఇవ్వాలి : కౌలు రైతు సంఘం

ప్రజాశక్తి - నంద్యాల

భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు కార్డులు ఇవ్వాలని కౌలు రైతు సంఘం నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి పి. సుధాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు నంద్యాల పట్టణంలోని టీ నరసింహయ్య భవనంలో కౌలు రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్ మార్కు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి సుధాకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో 2011వ సంవత్సరంలో కౌలు తీసుకున్న కౌలుదారులకు కౌలు కార్డులు ఆయా గ్రామాలలో విఆర్ఓ, ఎంపీఈవోల ద్వారా గ్రామ సభలు పెట్టి ఇవ్వడం జరిగిందన్నారు. కౌలుదారులకు అన్ని బ్యాంకుల్లో పంట పెట్టుబడి కోసం పంట రుణాలు ఇవ్వడం జరిగిందని, ప్రస్తుత ప్రభుత్వం భూ యజమానితో అగ్రిమెంటు ఉంటేనే కౌలు కార్డు ఇవ్వాలని ఒక జీవో తెచ్చిపెట్టడం జరిగిందన్నారు. ఈ చట్టం వలన అనేకమంది కౌలు రైతులకు కౌలు కార్డులు అందడం లేదని పేర్కొన్నారు. భూ యజమానులు అగ్రిమెంటుపై సంతకం పెట్టడానికి అంగీకరించక పోవడం తో కౌలు కార్డులు అందక కౌలు రైతులు ఈ ప్రభుత్వ ం ప్రవేశపెట్టిన రైతు భరోసా, పిఎం కిసాన్, ఇన్సూరెన్స్, వివిధ పథకాలకు దూరమై నష్టపోతున్నారని అన్నారు. అందుకే 2019 సంవత్సరంలో చట్టాన్ని సవరించి కౌలుదా రులు అందరికీ కౌలు కార్డులు ఇవ్వాలన్నారు. రానున్న రోజుల్లో జిల్లాలోని కౌలు రైతులందరినీ ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు డి. సామన్న, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ గురించి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పర్యావరణ రక్షణతోనే మనుగడ

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

పర్యావరణ రక్షణ తోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని రేంజర్ నాసిర్జా తెలిపారు. శుక్రవారం లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్మెంటల్ కార్యక్రమం కింద మండలంలోని ఈర్నపాడు, పెద్దదేవరాపురం, సింగవరం, రామాపురం గ్రామాల్లో గ్రామసభలు ఏర్పాటు చేసి ప్రజలకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఫ్ఎస్ఓలు రవీంద్ర నాయక్, వెంకట సుబ్బయ్యలు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, సాంప్రదాయ పద్ధతులను పాటించాలని అన్నారు. రైతన్నలు ఆర్గానిక్ వ్యవసాయం వైపు పయనించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బిఓలు రామకృష్ణ, వెంకటరమణ, మదర్ సాహెబ్, హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా ఉపాధి పనులు

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలో ఉపాధి పనులు ఊపందుకున్నాయని ఫీల్డ్ అసిస్టెంట్ రాముడు తెలిపారు. శుక్రవారం నంద్యాల మండలం కొత్తపల్లి గ్రామంలో ఉపాధి కూలీలతో (రోజ్ గార్ దివాస్) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పనులు తగ్గిపోవడంతో ఉపాధి కూలీల సంఖ్య గత మూడు వారాల కంటే మే మొదటి వారం నుండి బాగా పెరిగిందని అన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని పనిముట్లతో ఆరు గంటలకే పని ప్రదేశానికి చేరుకోవాలని సూచించారు. ఎండ ముదరక ముందే పనులు ముగించుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు, కూలీలకు లబ్ధి చేకూరుతుందని, జాబ్ కార్డు కలిగి. పని కోరిన ప్రతి ఒక్కరికీ పని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉన్నతాధికారులు ముందుకు వెళుతున్నారని తెలిపారు. ప్రతికూలికి సగటున ప్రస్తుతం 250 రూపాయల వరకు వేతనం వస్తుందన్నారు. ఇంకా క్వాంటిటీ, క్వాలిటీతో పనులు చేసి ప్రభుత్వం నిర్దేశించిన వేతనాన్ని అందుకోవాలని కూలీలకు సూచించారు. ఉపాధి కూలీలు మాట్లాడుతూ వేతనాలు 15 రోజులకు ఒకసారి చెల్లిస్తే బాగుంటుందని, తాగునీరు ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వివరిస్తానని తెలిపారు.

ఉపాధి కూలీల సమావేశంలో మాట్లాడుతున్న ఫీల్డ్ అసిస్టెంట్ రాము

ఉపాధి కూలీని పరామర్శిస్తున్న టిడిపి నాయకులు

ఉపాధి కూలీకి టిడిపి నేత పరామర్శ

ప్రజాశక్తి - మహానంది

మహానంది మండలం మసీదుపురం గ్రామంలో గురువారం ఉపాధి పనుల చేస్తుండగా ప్రమాదవశాత్తు కూలీ కొప్పెర్ల హరి పాము కాటుకు గురయ్యాడు. వెంటనే తోటి ఉపాధి కూలీలు, కుటుంబ సభ్యులు నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కొప్పెర్ల హరిని టిడిపి నాయకులు మౌళీశ్వర్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు ప్రభుత్వం వైపు నుంచి అన్ని విధాలా సహాయక చర్యలు, జాగ్రత్తలు పాటించే విధంగా అధికారులు సూచనలతో అవగాహన కల్పించాలన్నారు. పాము కాటుకు గురయిన హరిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఇంటికి షార్ట్ సర్క్యూట్

- వస్తువులు, నగదు దగ్ధం

- ప్రభుత్వం ఆదుకోవాలని వినతి

ప్రజాశక్తి - పాములపాడు

షార్ట్ సూర్క్యూట్‌తో ఇంటిలోని వస్తువులు, నగదు కాలిబూడిదయ్యాయి. వివరాల మేరకు.. మండలంలోని చెలిమిల్ల గ్రామంలో వెంకటలక్ష్మి అనే మహిళ శుక్రవారం నాడు కూలీ పనికి వెళ్ళింది. ఆ ఇంటిలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి నగదు, వస్తువులు దగ్ధమయ్యాయి. పక్కింటి వారు గమనించి తాళాలు పగలగొట్టి టీవీ, గ్యాస్ సిలిండర్‌ను, బయటికి తెచ్చారు. ఇటీవల ఆమె మేకలకు అని దాచుకున్న డబ్బు బూడిద అయ్యింది. నిత్యవసర వస్తువులు బియ్యము కాలిపోయాయి. దాదాపుగా రెండు లక్షల దాకా నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఆదుకోవాలని

కాలిపోయిన వస్తువులు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పాములపాడు

మృతి చెందిన బాలరాజు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల మేరకు.. పాములపాడు మండలం మిట్ట కందల గ్రామానికి చెందిన బాలరాజు (28) పాములపాడు టిఎన్ఆర్ కంపెనీలో టిప్పర్ల డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం నాలుగున్నర గంటల ప్రాంతంలో టిఎన్ఆర్ కంపెనీ ఆవరణంలో ఉన్న బోర్ దగ్గరికి వెళ్లి మొఖం కడుక్కుంటున్న సమయంలో పైపుకు కరెంటు వచ్చి మృతి చెందాడు. గతంలో గ్రామానికి చెందిన ఒక దున్నపోతు కూడా కరెంటు షాక్‌తో ఆ ప్రాంతంలో చనిపోయింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బంధువులు అధిక సంఖ్యలో పాములపాడు టిఎన్ఆర్ కంపెనీ వద్దక చేరుకున్నారు. మృతుని కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని, ఘటనకు నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. మృతుడు బాలరాజుకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. సంఘటన స్థలానికి పాములపాడు ఎస్సై అశోక్, ఆత్మకూరు సిఐ సుబ్రహ్మణ్యం చేరుకొని ధర్నాను విరమింపచేసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

మృతుడి బంధువులు ధర్నా చేస్తున్న దృశ్యం

వాలంటీర్ల సేవలు అభినందనీయం

వాలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి

ప్రజాశక్తి - బేతంచెర్ల

అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేయడంలో వాలంటీర్ల సేవలు అభినందనీయమని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, బేతంచెర్ల నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. శుక్రవారం నాడు బేతంచెర్ల పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో గల షాదికానలో వాలంటీర్లకు వందనం కార్యక్రమం బేతంచర్ల నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధాప్య, వితంతు పింఛన్లు పంపిణీ చేయడం, ప్రభుత్వము నుండి వచ్చే ప్రతి కార్యక్రమాన్ని ప్రజలకు చేరవేయడంలో గ్రామ వాలంటీర్లు ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని వారు కొనియాడారు. భవిష్యత్తులో వాలంటీర్లకు ప్రభుత్వాన్ని అన్ని విధాల సహాయ సహకారాలు అందించే విధంగా జగనన్న ప్రభుత్వం చేస్తుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో సేవారత్న అవార్డు రెండవ సచివాలయం- ఫరబ్ పాషా, సేవా రత్న ఆరవ సచివాలయం మంజువాణి, ఒకటో సచివాలయం పుష్పలత, మూడో సచివాలయం విజయలక్ష్మి, నాలుగో సచివాలయం సురేఖ, ఐదో సచివాలయం లక్ష్మీదేవి, 165 మందికి సన్మానం చేశారు.

పాములపాడు: వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఎర్ర గూడూరు గ్రామంలో వాలంటీర్లకు సన్మానం చేశారు. వైసిపి నాయకులు మురహరీ రాజన్న, పంచాయతీ కార్యదర్శి జీవన్ వాలంటీర్లకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సేవా మిత్ర వాలాంటరీలు, తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలోని జై కిసాన్ పార్కు నందు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ అర్షపోగు ప్రశాంతి, మున్సిపల్ ఆర్ఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో వాలంటీర్లకు సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలు ప్రధానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని 10వ సచివాలయం పరిధిలోని వాలంటీర్ల సేవలను గుర్తించి సేవా రత్నా, సేవా మిత్ర, సేవా వజ్రఅవార్డులను చైర్మన్, వైస్ చైర్మన్, మున్సిపల్ ఆర్ఓ ఆధ్వర్యంలో కౌన్సిలర్ షేక్ నాయబ్, దేశెట్టి సుమలత, లాలు ప్రసాద్, వైసిపి నాయకులు ఉస్మాన్ బేగ్, శాలి బాష, ఆర్ట్ శ్రీను వాలంటీర్లకు పురస్కారాలు

పాములపాడు: వాలంటీర్లను సన్మానిస్తున్న దృశ్యం

వాలంటీర్లను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, తదతరులు

O 22 R 4 వారసుల నోటీసు ప్రకటన

మహారాజశ్రీ నంద్యాల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు

I.A.NO.2074/2018 IN O.S.No.162/2008

1. లేటు పఠాన్ మాబున్ని వారసులు
2. పఠాన్ షరీఫ్ ఖాన్. ...అర్జీదారులు

V/s

పఠాన్ రజియ వగైరా,
2. షేక్. సోనియ సుమారు 23 సం॥,
భర్త షేక్ ఖాజా హుస్సేన్, హౌస్ వైఫ్,
4. పఠాన్ మన్సూర్, సుమారు 19 సం॥,
తండ్రి లేటు పఠాన్ అయూబ్ ఖాన్, ముస్లీం, కూలి,
5. పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్,
సుమారు 17 సం॥, లేటు పఠాన్ అయూబ్ ఖాన్,
ముస్లీం, కూలి, అందరి ఇంటి.నెం.10-82,
కటిక పేట, శిరివెళ్ళ గ్రామం, శిరివెళ్ళ మండలం,
కర్నూలు జిల్లా. ప్రస్తుతం నంద్యాల జిల్లా.
...2,4,5 వారసులు

సదరు దావాలో 5వ ప్రతివాది పఠాన్ అయూబ్‌ఖాన్ చనిపోయినందున, ఇతని తరుపున దావాలో ప్రతివాదులుగా చేర్చుటకు వారసులు అర్జీ దాఖలు చేయగా కోర్టు వారు 2,4,5 వారసులకు, వారసుల నోటీసులకు గాను 13-06-2023వ తేదీకి వాయిదా వేసినారు. 2,4,5 వారసులకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల ఉదయం 10.30 గంటలకు పై కోర్టుకు హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేనంతట యెక్స్‌పార్టిగా తీర్మానింపబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా తేది : 13-06-2023

శ్రీ.వి.రామచంద్రరావు గారు,
అర్జీదార్ల అడ్వకేటు, నంద్యాల.